క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత

పెదగంట్యాడ: విశాఖ జిల్లా రజక సంక్షేమ సేవా సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక బీసీ రోడ్డులోని టీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల సమస్యలను పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, పిడిమి రమణ, బలిరెడ్డి సత్యనారాయణ, మార్టుపూడి పరదేశి, ధర్మాల శ్రీను, భూపతిరాజు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'చదువంటే మాకిష్టం'



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ శాఖాధికారి రమణ విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించి, అందులోని నీతిని బోధించారు.

బాలాజీకి సహస్ర నామార్చన



విశేష పుష్పాలతో తిరుమల బాలాజీకి సహస్ర నామార్చన

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో బాలాజీకి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే తోమాల సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. రాత్రి విశేష పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించి ప్రసాద వితరణ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఘనంగా పైడితల్లమ్మ తీర్థం



పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.

కబ్జా కోరల్లో కృష్ణమహంతి చెరువు

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- పూర్తిస్థాయి సర్వేకు స్థానికుల డిమాండ్



చెరువులో చేపడుతున్న నిర్మాణాలు



ఆక్రమణకు గురవుతున్న కృష్ణమహంతి చెరువు

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 157లో కృష్ణ మహంతి చెరువు కబ్జాకు గురవుతోంది. దీనిపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత సచివాలయంలో ఫిర్యాదు చేయడంతో సచివాలయ వీఆర్వో, గాజువాక సర్వేయర్ కబ్జా జరిగిన ప్రాంతాన్ని ఇటీవల పరిశీలించినా అక్రమ నిర్మాణాలను తొలగించలేదని ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కబ్జాకు గురైన స్థలంలో చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి లోపల నిర్మాణాలు చేపట్టడంతో చెరువు ఎంత మేరకు కబ్జాకు గురైందనే విషయం బయటకు తెలియడం లేదని అంటున్నారు. ఇదే ప్రాంతంలో ఏకంగా చెరువులో నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువును ఒక ప్రణాళికప్రకారం రామాలయం పక్క నుంచి కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వరకు నిర్మిస్తున్న రోడ్డు పక్క నుంచి డెబ్రిస్‌తో ఆక్రమణదారులు కప్పేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువ గల భూమిని మింగేయాలని గ్రామంలో కొందరు నాయకులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే సుమారు 19 నుంచి 20 ఎకరాలకు పైగా ఉండాల్సిన కృష్ణ మహంతి చెరువు ఇప్పుడు 15 ఎకరాల వరకు మిగిలిందని అంటున్నారు.

సర్వే తర్వాతే సుందరీకరణ!

మరోవైపు చెరువు సుందరీకరణ పనులు జరపడానికి జీవీఎంసీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే... పూర్తి స్థాయిలో సర్వే చేపట్టిన తర్వాతే సుందరీకరణ పనులు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి చెరువులో నిర్మించిన ప్రహరీతోపాటు చేపట్టిన నిర్మాణాలను పూర్తిగా తొలగించాలని అంటున్నారు. ఈ కబ్జా వల్ల నాతయ్యపాలెంలో నిర్మించాల్సి ఉన్న పీహెచ్‌సీ, ఓపెన్ జిమ్‌ను కోల్పోయామని గ్రామస్తులు అంటున్నారు. ఈ అంశంపై వివరణ కోరడానికి గాజువాక తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు 'సాక్షి' విలేకరి ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదు.

ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటాం



1,088వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అనే నినాదంలో ఉద్యమ ఫలితంగా ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 1,088వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో ఆదివారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు గురించి ప్రజలంతా నిలదీసే సమయం ఆసన్నమైందని, ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడంలో కార్మిక వర్గంతో ప్రజలంతా మమేకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు అగనంపూడి జట్టు



విజయోత్సవంతో జ్ఞాపికను ప్రదర్శిస్తున్న అగనంపూడి జట్టు

అగనంపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ పోటీల్లో జోన్-6(అగనంపూడి) జట్టు సత్తా చాటింది. విశాఖ జిల్లా స్థాయి పోటీల్లో జోన్-6 పోటీల్లో విశాఖ పశ్చిమ జట్టుపై గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈమేరకు ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు నిర్వాహకులు షీల్డ్‌ను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు గుర్రం శ్రీను, అగనంపూడి ప్రశాంతినగర్ వార్డు సచివాలయ అడ్మిన్ ధనలక్ష్మి తదితరులు అభినందించారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీ విజేత లింగేశ్వరరావు



బహుమతి అందుకుంటున్న లింగేశ్వరరావు జోడి

ఉక్కునగరం: జాతీయ మాస్టర్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బి.వి.ఎస్.కె.లింగేశ్వరరావు విజేతగా నిలిచారు. పంజాబ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, మహారాజ అగ్రసన్ స్పోర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రంలోని మొహాలీలో జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు మాస్టర్స్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 2024 నిర్వహించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. లింగేశ్వరరావు డబుల్స్ 55 ప్లస్ కేటగిరీలో చెన్నైకు చెందిన డాక్టర్ మారన్ తంగవేలుతో పాల్గొన్నారు. పోటీల్లో లింగేశ్వరరావు జట్టు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయనను ఉక్కు అధికారులు, పలువురు క్రీడాకారులు, పలు సంఘాల ప్రతినిధులు అభినందించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం శ్రీనగర్‌లోని విశ్వేశ్వరాల కాలనీలో అపార్ట్‌మెంట్ వాసులకు నేరాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లు, వ్యాపార సముదాయాలతోపాటు పబ్లిక్ ప్లేసుల్లో ఆయా అసోసియేషన్ల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చైన్ స్నాచింగ్, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు వంటి వాటిపై వివరించారు. నేరాల నియంత్రణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో క్రైం ఎస్ఐ ఎ.మన్మధరావు, హెచ్‌సీ వరహాలు, సిబ్బంది ఏసుబాబు, కాలనీ అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి గాయత్రి అర్చన



కొండయ్యవలస కేంద్రంలో సత్యసాయి గాయత్రి జపం చేస్తున్న బాలలు



పెదమడక కేంద్రంలో సాయి గాయత్రి నామస్మరణ చేస్తున్న పిల్లలు

అగనంపూడి: సత్యసాయి భజన మండలి అగనంపూడి సారథ్యంలో ఆదివారం అగనంపూడిలోని ఐదు బాల వికాస్ కేంద్రాల్లో ఘనంగా సత్యసాయి గాయత్రి అర్చన జరిపించారు. తండులార్చన సందర్భంగా అగనంపూడి బీసీ కాలనీ, పెదమడక, దిబ్బపాలెం (దానబోయినపలెం), కొండయ్యవలస, గళ్లవానిపాలెం ప్రాంతాల్లోని కేంద్రాల్లో సుమారు వంద మంది బాలలు ఉత్సాహంగా పాల్గొని 108 బియ్యంతో 108 సార్లు సాయి గాయత్రి అర్చన, నామస్మరణ చేశారు. కార్యక్రమంలో కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సూర్య



గాజువాక: డెమొక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా 73వ వార్డు సింహగిరి కాలనీ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ డి.ఎ.సూర్య ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో తనను ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తనను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోసెఫ్ కిశోర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్, నమ్మివానిపాలెం, ఆశిపాలెం గ్రామాల్లో ఆదివారం ప్రబోధ సేవా సమితి విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ప్రబోధానంద యోగీశ్వరుడు రచించిన వంద గ్రంథాల త్రైత సిద్ధాంత గ్రంథాలపై వివరించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మతోపాటు యోగ అధ్యాయంలో పురుషోత్తమ ప్రాప్తి శ్లోకాలను వివరించారు. ప్రచారంలో హిందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, ప్రతినిధులు ఎస్.శ్రీనివాస్, వి.సురేష్, కె.లక్ష్మి, బి.అంకమ్మ, జి.సన్యాసి, కె.రాజు, కె.బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి విండ్‌బాల్ క్రికెట్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: గంగవరం ఎలెవెన్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న మండల స్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్‌ను ఆదివారం బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతి, ట్రోఫీలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు సిహెచ్.ధనరాజు, పోలరాజు, మసేను, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి రాచకొండ నరసింహశర్మ



ఏవీఎన్ కళాశాలలో వందో జన్మదినోత్సవం జరుపుకుంటున్న డాక్టర్ రాచకొండ నరసింహ శర్మ

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ వైద్యుడు, కవి, రచయిత, అనువాదకుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ శత జన్మదినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు శర్మ వేడుకల్లో పాల్గొని ఆయన్ని ఘనంగా సత్కరించారు. వందో జన్మదినోత్సవం కళాశాలలో జరిపించడం ఆనందంగా ఉందని, రాచకొండను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త, బీవీకే కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ డీవీ సూర్యారావు మాట్లాడుతూ డాక్టర్ రాచకొండ నరసింహ శర్మ వ్యక్తిత్వం మహోన్నతమైనదని, సాహిత్య రంగంలో విశేష ప్రజాదరణ పొందారని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది రాచకొండ ఉమాకుమార్ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు నరసింహ శర్మ అడుగు జాడల్లో నడుస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల సహాయ ఆచార్యుడు డాక్టర్ కిలారి గౌరీనాయుడు మాట్లాడుతూ శర్మ సేవలను కొనియాడారు. తెలుగు–ఆంగ్ల భాషలకు నరసింహ శర్మ వారధి వంటి వారని, శతాధిక ప్రసిద్ధ ఆంగ్ల కవులను తెలుగు వారికి పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు పి.వెంకటరత్నం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డి.గాయత్రి నరసింహమూర్తి, శ్రీనివాస్, అర్చన, స్వరాజ్యలక్ష్మి, పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

ఎస్టీయూ జిల్లా కార్యదర్శి పైడిరాజు



రాజారావును సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

విశాఖ విద్య: ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా మారాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సౌత్ ఇండియా స్థాయి సైన్సు ఫెయిర్‌లో ఉపాధ్యాయ కేటగిరీలో రాష్ట్రం నుంచి మొదటి బహుమతి సాధించిన జిల్లాలోని గంగవరం జెడ్పీ హైస్కూల్ సైన్సు ఉపాధ్యాయుడు పి.రాజారావును ఘనంగా సన్మానించారు. సైన్సు పరిశోధనల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా, నిత్య విద్యార్థిలా సరికొత్త ప్రయోగాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇతర ఉపాధ్యాయులకు రాజారావు మాస్టారు కృషి స్ఫూర్తిదాయకమని అభినందించారు.

జిల్లా కార్యదర్శిగా పైడిరాజు

ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కార్యదర్శిగా అడవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్న పైడిరాజు సేవలు జిల్లాలో మరింత వినియోగించుకునేలా కీలకమైన కార్యదర్శి పోస్టులో ఎంపిక చేశారు.

11న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

డాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 11న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండప సంఘం, వాసవీ విజ్ఞాన మండలి, వాసవీ సమాజం, ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్, వాసవీ చైతన్య ఫౌండేషన్, వైశ్య స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిసెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్ మాట్లాడుతూ ఆ రోజు వేకువజాము 3 గంటలకు అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక క్షీరాభిషేకం, ఉదయం 7.30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక ఆత్మార్పణ అలంకరణ, 8 గంటలకు ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తామన్నారు.

కరాటేలో విద్యార్థులకు పతకాలు



సర్టిఫికెట్లు అందుకుంటున్న మౌంట్ డియోస్ విద్యార్థులు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు అడవివరంలోని మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో సత్తా చాటారు. కూర్మన్నపాలెంలో అకాడమీ ఆఫ్ షిటోరుయ్ కరాటే దూ ఇండియా(ఆస్కీ) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు హాజరయ్యారు. బెల్ట్ గ్రేడింగ్‌లో వామస్స్, సీటప్స్, పంచెస్, బ్లాక్స్, కిక్స్, స్టాండ్స్, కటస్ పరీక్షల్లో విద్యార్థులు శ్రీల, లీలా వైష్ణవి, లాలిత్య, దేవకి, ప్రణతి ఎల్లో బెల్ట్ సాధించారు. వీరికి నిర్వాహకులు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులను మౌంట్ డియోస్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు, ఆర్‌టీఏ మాజీ కమిషనర్ ఎం.విజయనిర్మల, సొసైటీ సెక్రటరీ ముత్తంశెట్టి కృష్ణారావు, సీఈవో ముత్తంశెట్టి అఖిల, ప్రిన్సిపాల్ ఎవ. భార్గవి నాయక్ అభినందించారు.

70 ప్యాకెట్ల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు



పోలీసులు సీజ్ చేసిన కారు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా పాడేరు నుంచి నగరానికి తరలిస్తున్న గంజాయిని స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సహకారంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి ఏపీ39 ఎన్‌క్యూ 2485 నంబర్ గల కారులో గంజాయి తీసుకొచ్చి నగరంలోని తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులో గల కేంద్రీయ విద్యాలయం వెనుక గేటు వద్ద పార్క్‌చేసి వెళ్లిపోయారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులతోపాటు ఏఎస్ఐ ఎం.గురునాథ్, హెడ్ కానిస్టేబుల్ కె.ఎస్.నాయుడు సమాచారంతో ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఒక వ్యాన్ సహాయంతో ఆ కారును ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అందులో 70 ప్యాకెట్ల గంజాయి(140 కిలోలు) ఉన్నట్లు గుర్తించారు. కారును సీజ్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు గుర్తించిన పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సీఐ సన్యాసినాయుడు

మల్కాపురం: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేదిలేదని, బహిరంగ ప్రదేశాల్లో యువత ఇబ్బందికరంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మల్కాపురం సీఐ సన్యాసినాయుడు హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం ఆయన పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసిన గస్తీ నిర్వహించారు. మల్కాపురం పాత పెట్రోల్ బంక్ వద్ద, శ్రీహరిపురం మైదాన ప్రాంతంలో, ప్రకాష్‌నగర్, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆరుబయట మద్యం, ధూమపానం చేస్తున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

అనంతరం ఆ యువత తల్లిదండ్రులను పిలిపించి వారు చేస్తున్న చేష్టలను వివరించారు. మరలా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు అయిన M/s Sri Veera Hanuman Constructions rep by its Partners 1) Nalla Vijaya Uma Chandra Mouli 2) Uddagiri Tatarao 3) M/s Sri Veera Anjaneya Constructions rep by its Managing Partner Sri Vallabhaneni Durga Prasad. అను వారలు ఈ క్రింది షెడ్యూలులో వివరించినటువంటి ఆస్తిని 1) Smt. Ponnada Eswaribai 2) Smt. Kella Jaya Lakshmi Alias Vijayalakshmi 3) Smt. Kallepalli Lakshmi 4) Ragolu Krishna Kumari 5) Smt. Talegada devi Padmavathi 6) Smt. Kella Usha Rani 7) Smt. Endamuri Rama Lakshmi 8) Kotipalli Jagadamba represented by thier General Power of Attorney holder Sri Dama Subba Rao నుండి కొనుగోలు చేయుటకు యిరు పార్టీలవారు అంగీకరించి పెద్దమొత్తంలో అడ్వాన్సు యిచ్చి పుచ్చుకోవటం జరిగినది.

సదరు అమ్ముతున్న ఆస్తిని కోటిపల్లి గున్నమ్మ గారు 21-06-1971 నం॥లో డాక్యుమెంటు నెం. 2436/1971 రుగా అబ్దుల్ జబ్బర్ వగైరాల నుండి సుమారు ఎ॥ 2.56 సెంట్లు కొనుగోలు చేసియుంటిరి. తదుపరి సదరు గున్నమ్మ గారు తేది. 13-06-2008న డాక్యుమెంటు నెం. 111/2008రుగా రిజిస్ట్రీ వీలునామా వ్రాసియున్నారు. తద్వారా ఎ॥1.54 సెంట్లు ఆమె తమ్ముడైన పొన్నాడ మోహనరావుకి, మిగిలిన ఎ.1.00 సెంట్లు యిందులో అమ్మకందారులకు దఖలు పరిచియున్నారు. సదరు గున్నమ్మగారు తేదీ. 20-12-2009న మరణించినారు. ఆమె మరణానంతరం షెడ్యూలులో వివరించిన ఆస్తి అమ్మకందారులు హక్కు, అనుభవములో ఉన్నదనియు, నా క్లయింట్సుకు అమ్మకం పెట్టియున్నారు. కావున సదరు ఆస్తి విషయమై ఎవరికైననూ, ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ క్రింది చిరునామాకు ఏడు దినములలోపు తెలియజేయవలెను. అట్లు కాని యెడల ఎవరికీ ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి మిగిలిన క్రయధనం చెల్లించి రిజిష్టర్డు క్రయచీటీ పొందుదురు. గడువు తేదీన తరువాత వచ్చు అభ్యంతరములు పరిశీలింపబడవు.

షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా గ్రేటరు విశాఖపట్నం మున్సిపల్ పరిధిలోగల కూర్మన్న పాలెం గ్రామం, సర్వే నెం. 35/10, 11, పట్టా నెం. 3,4,5లో గల చ॥ 3678 .4 గం॥లు లేక చ॥ 3075.620 లుగా గల ఖాళీ స్థలంనకు హద్దులు: **తూర్పు:** పొన్నాడ మోహనరావు గారి ఖాళీ స్థలం, **దక్షిణం:** 33 అడుగుల రోడ్డు మరియు ఉడా ఫేజ్-II లే అవుట్ స్థలం. **పడమర:** రోడ్డు మరియు మాతృశ్రీ నగర్ లే అవుట్, **ఉత్తరం:** సర్వే నెం. 35/8 బిలో గల భూమి మరియు ఉడా ఫేజ్-II లే అవుట్

Visakhapatnam
Dt. 04-02-2024

A.Prasada Rao, I.S.K.Satyaveni, A.Rajesh, G.Alekya, Advocates
D.No. 50-50-33/2/1, Beside Gurudwar, NH-5 Road, Visakhapatnam.
Cell: 9849121666